


# వృద్ధాప్యానికి పునాది

-డా.భండారు ఉమామహేశ్వర రావు

**ఉగాది పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

పడక కుర్చీలో కూర్చుంటే వీపు దాదాపు నేలకు తగులుతున్నది పూర్ణచంద్రరావుకు. అతనికి నడుము నెప్పి. వెన్నుపూస ఒంగిపోయి గంటలు గంటలు అందులో కూర్చోవటం ఆయనకు కష్టంగా ఉంటుంది. ఆ కష్టం ఆయన భార్య రామేశ్వరమ్మ గమనిస్తూనే ఉంటుంది. అది మార్చి నిటారుగా కూర్చునే ఒక చెక్క కుర్చీ కొనుక్కోమని ఎన్నిసార్లు చెప్పినా ఆయన వినడు.

పూర్ణచంద్రరావు పేదవాడేమీకాదు. ఉన్నత ప్రభుత్వోద్యోగం చేసి పదవీ విరమణ చేశాడు. ఉద్యోగాంతంలో వచ్చిన డబ్బూ, తను మిగిల్చిందీ ఇద్దరు కొడుకులకూ పంచేశాడు. నిష్ఠగా ఉద్యోగం చేసినవాడు. ఏ ఇతర వ్యాపకాలూ, సభలూ, సన్మానాలూ, పురాణ కాలక్షేపాలూ ఆయనకు ఉద్యోగం ముందర అంత ప్రధానంగా కన్పించేవి కాదు.

"ఎన్నోసార్లు చెప్పాను మీకు. ఒక మంచి కుర్చీ కొనుక్కోండి అని. డాక్టరు కూడా చెప్పాడు. నిటారుగా కూర్చోవాలి. లేకపోతే వెముకలు నెప్పి పెడతాయని. పిల్లలు కొంటామన్నా వద్దంటారు." అన్నది రామేశ్వరమ్మ.

ఆ ప్రసక్తి వచ్చినప్పుడల్లా దీర్ఘాలోచనలో పడతాడు పూర్ణచంద్రరావు. ఆయన ముఖంలో ఏదో 'వెతుకులాట' కనిపిస్తుంది. పెద్దవాడు సుధాకర్ గాని చిన్నవాడు అమరేంద్ర కాని ఆయనకు ఏలోటూ చెయ్యరు. అమ్మనూ, నాన్ననూ బాగానే చూసుకుంటారు. ఆయన ఏం ఆలోచిస్తుంటాడో రామేశ్వరమ్మకు అర్థంకాదు.

అప్పుడు సాయంత్రం దాదాపు ఆరు గంటలయింది. నందనా గార్డెన్స్‌లో సుందరకాండ మీద ఉపన్యాసం ఉంది. తండ్రీ, తల్లీ ఈమధ్య ధార్మిక ఉపన్యాసాలంటే ఇష్టం కనబరుస్తున్నారని తీసుకువెళ్దామనుకున్నాడు సుధాకర్.

"నాన్నా! త్వరగా రడీకండి. లేటవుతుంది. ఉపన్యాసం పూర్తిగా వినలేదని బాధపడతారు మళ్ళీ." అన్నాడు సుధాకర్.

"తీస్తున్నానా! శరీరానికి చర్మం అతుక్కున్నట్టే ఒంటికి ఈ కుర్చీ బట్ట అతుక్కుంటుంది. దానికి నామీద విపరీతమయిన వ్యామోహం. లేవనివ్వదు ఒక పట్టాన." అంటూ రెండు చేతులూ బలంగా కుర్చీ చేతుల మీద మోపి లేచాడు. సహాయపడటానికి రామేశ్వరమ్మ వచ్చింది.

సుధాకర్ తన గదిలోకి వెళ్ళాడు తయారవటానికి. "లేవలేకపోతుంటే కాస్త పట్టుకోమని పిలవచ్చుగదా!" అంది రామేశ్వరమ్మ. పూర్ణచంద్రరావు చిరునవ్వు నవ్వాడు. నవ్వి మళ్ళీ తన ఆలోచనలో పడిపోయాడు. అతని ముఖకవళికల్లో ఒక అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తున్నది రామేశ్వరమ్మకు.

"ఏమిటండీ ప్రతిసారీ కుర్చీలోంచి లెమ్మన్నా... ఇంకో కుర్చీ కొనుక్కోమన్నా అట్లా ముఖం పెడతారు" అన్నది.

"అది నీకు సంబంధించినది కాదులే."

"ఈ వయసులో కూడా నాకు సంబంధించని విషయాలు మీకు ఉన్నాయన్నమాట." అన్నది రామేశ్వరమ్మ ముందుకు అడుగువేస్తూ.

"చూడు రమా! ఎన్నేళ్ళు కలిసి జీవించినా నువ్వు నువ్వే. నేను నేనే. భార్య భర్తల్లో సగభాగం మాత్రమే. మిగతా సగభాగం భర్తకే చెందుతుంది. అసలయిన అర్థనారీశ్వర తత్వం అదే..." అన్నాడు పూర్ణచంద్రరావు.

"సరే లెండి. మీ వేదాంతం వెర్రితలలు వేస్తున్నది." అంటూ బయటకు కదిలింది పూర్ణచంద్రరావుతో. సుధాకర్ దంపతులు కూడా వెంట నడిచారు.

కార్యక్రమానికి వెళ్ళి వచ్చినంతసేపూ ఏదో ఆలోచిస్తూనే ఉన్నాడు పూర్ణచంద్రరావు. అతనికి డెబ్బైఆరు సంవత్సరాలు. నిజంగా భార్య అన్నట్టు వేదాంతం ఎక్కువయిందా... అసలు తనలో వేదాంత ధోరణి మొదలయిందా...

కళ్ళముందర మసక మసకగా ఒక భవనం కనపడింది పడక కుర్చీలో కూర్చున్న పూర్ణచంద్రరావుకు. అది గాలిలో లేస్తున్నది. అటూ ఇటూ ఊగుతున్నది. అదిగో పడుతోంది.. పడుతోంది.. ఒక్కసారి తల విదిల్చాడు పూర్ణచంద్రరావు.

"ఏంటండీ... ఏమయింది. తల అట్లా ఊపుతున్నారు. మెడలు నెప్పి పుట్టేను. ఇప్పటికే ఆ మెడ పట్టేసుకుని అవస్థపడుతున్నారు."

సుధాకర్ మధ్య గదిలోకి వచ్చాడు. "నాన్నా! ఉపన్యాసం బావుందా!" అని అడిగాడు.

"ఆ! బావుందిరా!" అన్నాడు తండ్రి. కాని మళ్ళీ అదే ఆలోచనా ధోరణి.

"సుధా! మీ ఎం.డి.తో ఆమధ్య ఏదో గొడవ అయ్యిందన్నావ్. అంతా సర్దుకుందా!" అన్నాడు వెళ్తున్న సుధాకర్‌ను ఉద్దేశించి.

"లేదు నాన్నా! వాడొక తిక్కవెధవ. అనవసరంగా నన్ను మానిస్తున్నాడు. యూనియన్ వాళ్ళు నావైపు ఉండటంతో ఏం చెయ్యలేక పోతున్నాడు కానీ లేకపోతే ఈపాటికి సస్పెండ్ చేసేవాడే. అయినా మీరివన్నీ ఆలోచించకండి. హాయిగా పురాణ కాలక్షేపం చేసుకుంటూ ఉండండి. అన్నీ నేను చూసుకుంటాను." అని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

వాళ్ళ ఎం.డి.కి పరిచయం ఉన్న తన స్నేహితుడితో చెప్పి మాట్లాడిస్తానన్నా వద్దంటాడు. చిన్నప్పుడు బడికి ఒక రోజు వెళ్ళకపోతే, "నాన్నా! టీచరు కొడతాడు. నువ్వొచ్చి నాకు నిన్న జ్వరం వచ్చిందని చెప్పు." అని ప్రాణం తీసేవాడు. ఇట్లా ఎన్నోసార్లు సమస్యలు వచ్చినా తననే సలహా అడిగేవాడు. ఇప్పుడు ఉద్యోగానికి ప్రమాదం ముంచుకొస్తున్నా తనను మాట్లాడనివ్వటంలేదు. అడిగే వరకూ కనీసం చెప్పటంలేదు. కళ్ళు మూసుకున్నాడు పూర్ణచంద్రరావు.

ఇందాక కళ్ళముందర కనపడ్డ భవనం మళ్ళీ దర్శనమిచ్చింది. మెల్లగా అటూ ఇటూ ఊగుతోంది. ఎక్కడ పడిపోతుందోనని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. దైవధ్యానం

